ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## సీఎం, మంత్రుల పర్యటన

### 'మేడిగడ్డ'లో అధికారుల ఏర్పాట్లు

భూపాలపల్లి, ఫిబ్రవరి, 11 (ప్రభాత ఉదయం): నిర్మాణ లోపాలు ఎత్తి చూపేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీని ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బ్యారేజీ దెబ్బతిన్న ప్రాంతానికి చేరుకొనే విధంగా చదును పనులు చేస్తున్నారు. బ్యారేజీ దిగువన, గోదావరికి తీరానికి వెళ్లే మార్గాలను సులభతరం చేస్తున్నారు. వ్యూపాయింట్ ప్రాంగణం వద్ద 3 వేల మంది కూర్చునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడే నిర్మాణ లోపాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సభ నిర్వహించే అవకాశం ఉంది. భద్రతపరంగా ఆయా మార్గాల్లో పోలీసు అధికారులు ప్రయాణించి పరిశీలించారు. రహదారులు, కల్వర్టులను బాంబు స్క్వాడ్ తనిఖీ చేస్తోంది.

సంపుటి: 1 | సంచిక: 308 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 12 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# బీఆర్ఎస్ మరో భారీ షాక్

## సీఎం రేవంత్ రెడ్డితో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ భేటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం): అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతున్నాయి. కీలక నాయకులంతా పార్టీని వీడుతున్నారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన కీలక నాయకుడు ముఖ్యమంత్రిని కలిశారు. విపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వరుస కడుతున్నారు. ఇటీవల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కీలక నాయకుడు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి దంపతులు, హైదరాబాద్ మాజీ ఉప మేయర్ బాబా ఫసీయుద్దీన్ కలవగా.. తాజాగా హైదరాబాద్‌కు చెందిన కీలక నాయకుడు బొంతు రామ్మోహన్ ముఖ్యమంత్రిని కలిశారు. ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి త్వరలోనే రామ్మోహన్ రాజీనామా చేయనున్నట్లు సమాచారం. గతంలో జోడెద్దులుగా హైదరాబాద్ కు పనిచేసిన మాజీ మేయర్, డిప్యూటీ మేయర్ ఇద్దరూ కాంగ్రెస్ లో చేరుతుండడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల్లో రామ్మోహన్ గులాబీ పార్టీ తరఫున ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ ఆశించారు. అయితే అక్కడ ఇతరులకు కేటాయించడంతో రామ్మోహన్ నిరాశ చెందారు. పార్టీ తరఫున బండారు లక్ష్మారెడ్డి పోటీ చేసి గెలిచారు. అతడు గెలుపులో రామ్మోహన్ కీలక పాత్ర పోషించారు. అయితే టికెట్ నిరాకరణతో అప్పటి నుంచి పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మల్కాజిగిరి ఎంపీ టికెట్ కూడా ఆశిస్తున్నారు. అయితే పార్టీ అధిష్టానం మాత్రం రామ్మోహన్ అభ్యర్థను పరిశీలించడం లేదు. టికెట్ దక్కే అవకాశాలు లేకపోవడంతో రామ్మోహన్ అధికార పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.




## వాహనదారులకు గుడ్ న్యూస్

### ఫాస్టాగ్స్ ఉండవు

### కేంద్రం కీలక నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం) వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. గతంలో టోల్ ప్లాజాల దగ్గర వాహనదారులు మాన్యువల్‌గా టోల్ ఛార్జీలు చెల్లించేవారు. తర్వాత ఆటోమెటిక్‌గా టోల్ ఛార్జీలు వసూలు చేసే ఫాస్టాగ్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు దీని స్థానంలో కేంద్రం కొత్తగా జీపీఎస్ ఆధారిత టోల్ కలెక్షన్ సిస్టమ్‌ను తీసుకొస్తోంది. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్‌ను వాహనదారులు రీఛార్జ్ చేయాలి, తగినంత క్యాష్ బ్యాలెన్స్ ఉండాలి. ప్రతిసారీ ఇలాంటి తలనొప్పులు లేకుండా, ఫాస్టాగ్‌ల నుంచి జిపిఎస్ ఆధారిత టోల్ సిస్టమ్‌కి మారాలని భారత ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల హైవే ప్రయాణం మరింత వేగంగా, సాఫీగా మారనుంది. ఫాస్టాగ్‌లు అనేవి ఎలక్ట్రానిక్ ట్యాగ్స్. వీటితో టోల్ ప్లాజాల వద్ద ఆగకుండా వాహనదారులు టోల్ ఛార్జీలు చెల్లించవచ్చు. ట్రాఫిక్ రద్దీ, వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి 2016లో వీటిని ప్రవేశపెట్టారు. అయితే ఇప్పటికీ లో-బ్యాలెన్స్ అలర్ట్స్, సాంకేతిక లోపాలు వంటి కొన్ని సమస్యలను వాహనదారులు ఎదుర్కొంటున్నారు. వీటికి పరిష్కారంగా జిపిఎస్ ఆధారిత టోల్ సిస్టమ్ తీసుకురావాలని ఇండియన్ గవర్నమెంట్ ప్లాన్ చేస్తోంది.

**ఎన్నో ప్రత్యేకతలు**

జిపిఎస్ ఆధారిత టోల్ సిస్టమ్ అనేది ఒక కొత్త టెక్నాలజీ. ప్రస్తుతం దీనిని ముంబైలోని అటల్ సేతు వంటి కొన్ని రహదారులపై పరీక్షిస్తున్నారు. ప్రత్యేక కెమెరాలతో కదిలే వాహనాల నంబర్ ప్లేట్లను స్కాన్ చేయడం ద్వారా ఇది పనిచేస్తుంది. ఆ కెమెరాలు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్ పి ఆర్ )టెక్నాలజీతో వర్క్ అవుతాయి. ఈ సిస్టమ్‌లో వెహికిల్ రిజిస్ట్రేషన్‌కు లింక్ అయిన బ్యాంక్ అకౌంట్ నుంచి టోల్ అమౌంట్ డెబిట్ అవుతుంది. జిపిఎస్-ఆధారిత టోల్ సిస్టమ్ ఫాస్టాగ్‌ల కంటే అనేక ప్రయోజనాలు ఆఫర్ చేస్తుంది. అవేంటంటే..

**బెనిఫిట్స్ ఇవే..**

జీపీఎస్ టోల్ కలెక్షన్ సిస్టమ్ అందుబాటులోకి వస్తే, టోల్ ప్లాజాల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించాల్సిన లేదా ఆపాల్సిన అవసరం రాదు. దీనివల్ల ప్రయాణ ..మిగతా 2లో

# బీజేపీకి ఒంటరిగానే 370 సీట్లు



**కాంగ్రెస్ తుడిచిపెట్టుకు పోవడం ఖాయం**

**మోడీ సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 11 (ప్రభాత ఉదయం): 2024 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కూటమి తుడిచిపెట్టుకుపోతుందన్నారు ప్రధాని నరేంద్ర మోడీ. బీజేపీ ఈసారి ఒంటరిగానే 370 సీట్లు దాటుతుందని జోస్యం చెప్పారు. గత ఎన్నికలతో పోల్చితే ఒక్కో బూత్‌లో అదనంగా 370 ఓట్లు వచ్చేలా చూడాలని, బీజేపీకి 370 లోక్‌సభ స్థానాలు దక్కేలా చూడాలని మోడీ ఓటర్లకు పిలుపునిచ్చారు. 2024 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కూటమి తుడిచిపెట్టుకుపోతుందన్నారు ప్రధాని నరేంద్ర మోడీ. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని ..మిగతా 2లో

# ఇరిగేషన్ శ్వేతపత్రంపై చర్చకు సన్నద్ధం

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం





హైదరాబాద్, ఫిబ్రవరి, 11 (ప్రభాత ఉదయం): ప్రజాభవన్‌లో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇరిగేషన్ శాఖపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. సోమవారం అసెంబ్లీలో నీటిపారుదలశాఖపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయనున్న తరుణంలో ప్రజాభవన్‌లో ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నీటిపారుదల తీరుతెన్నులపై జరిగే చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనుసరించాల్సిన వ్యూహంపై సీఎం, మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం చేశారు. కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించే విషయంలో నెలకొన్న వివాదంపైనా ప్రధానంగా చర్చించారు.



## మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలపై రేవంత్ సర్కారు దృష్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం): నిజాం షుగర్ ఫ్యాక్టరీతో పాటు దాని అనుబంధ కర్మాగారాలపై దృష్టి సారించింది సీఎం రేవంత్ రెడ్డి సర్కారు. ప్రైవేట్ పరమైన ఈ ఫ్యాక్టరీ మూత పడటంతో వందల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఈ క్రమంలోనే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కమిటీ వేసిన ప్రభుత్వం.. రెండు నెలల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో మూతబడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే ప్రయత్నాలు ప్రారంభించి కాంగ్రెస్ ప్రభుత్వం. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని ప్రధాన చక్కెర కర్మాగారంతో పాటు అనుబంధ సంస్థలు.. ప్రైవేట్ పరం కావడంతో కొన్నేళ్లుగా మూతపడ్డాయి. దీంతో చాలా మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఈ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కమిటీ వేసింది ప్రభుత్వం. ఈ కమిటీలో మొత్తం పది మంది సభ్యులు ఉంటారు. కమిటీకి మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్‌గా, మరో మంత్రి దామోదర రాజ నర్సింహ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రావుకు అవకాశం కల్పించారు. వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో పాటు నిజాం షుగర్స్ లిమిటెడ్ ఎండీని సభ్యులుగా నియమించారు. కాగా, 2002లో చక్కెర ఫ్యాక్టరీ పూర్తిగా ప్రభుత్వం అధీనంలో ఉండేది. అనంతరం 51 శాతం భాగస్వామ్యంతో ప్రైవేటు వ్యక్తుల ..మిగతా 2లో

## 20 నుండి బీజేపీ విజయ సంకల్ప యాత్రలు

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం): ఈ నెల 20 నుండి బీజేపీ విజయ సంకల్ప యాత్రలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకి దేశ వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో సానుకూల వాతావరణం ఉందన్నారు. ప్రజలు నరేంద్ర మోడీకి కమలం పువ్వుకే ఓటేసెందుకు ముందే నిర్ణయం తీసుకున్నారని, తెలంగాణ లో బీజేపీ అన్ని స్థానాలకు పోటీ చేయబోతున్నామన్నారు. తెలంగాణ ప్రజల మద్దతు, ఆశీస్సుల కోసం 5 యాత్రలు నిర్వహించాలని ఫిబ్రవరి 20 నుండి మార్చి ఒకటి వరకు యాత్రలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 5 పార్లమెంట్ క్లస్టర్ లలో ..మిగతా 2లో

### నేడు బీహార్ అసెంబ్లీలో

# నితీశ్ సర్కారుకు బలపరీక్ష



**మహాబోధి రిసార్ట్ నుంచి పట్నాకు బీజేపీ ఎమ్మెల్యేలు**

పట్నా. ఫిబ్రవరి, 11 (ప్రభాత ఉదయం): బీహార్ అసెంబ్లీలో నేడు జేడీయూ చీఫ్ నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు బలపరీక్ష ఎదుర్కోనుంది. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా గయాలోని మహాబోధి రిసార్ట్‌లో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు బయటికి వచ్చారు. ప్రత్యేక బస్సులో పట్నాకు బయలుదేరారు. బీహార్ అసెంబ్లీలో నేడు జేడీయూ చీఫ్ నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు బలపరీక్ష ఎదుర్కోనుంది. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా గయాలోని మహాబోధి రిసార్ట్‌లో ఉన్న ..మిగతా 2లో

# బీజేపీకి ఒంటరిగానే 370 సీట్లు

మొదటి పేజీ తరువాయి...



ఝుబువాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. బీజేపీ ఈసారి ఒంటరిగానే 370 సీట్లు దాటుతుందని జోస్యం చెప్పారు. ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్ ఖాయమని ప్రధాని స్పష్టం చేశారు. ప్రజల కోసం 24/7 కష్టపడతామని.. ఎన్డీయే కూటమికి 400 సీట్ల పైనే వస్తాయని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. గిరిజనులను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేయడమే కాదు, వారిని అవమానపరిచిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ దుస్థితికి కాంగ్రెస్సే కారణమని.. గిరిజనులంటే కాంగ్రెస్‌కు చిన్న చూపని మోడీ దుయ్యబట్టారు. గిరిజనులను కాంగ్రెస్ ఓటు బ్యాంకులా మాత్రమే వాడుకుంటోందని ఆయన ఫైర్ అయ్యారు. గత ఎన్నికలతో పోల్చితే ఒక్కో బూత్‌లో అదనంగా 370 ఓట్లు వచ్చేలా చూడాలని, బీజేపీకి 370 లోక్‌సభ స్థానాలు దక్కేలా చూడాలని మోడీ ఓటర్లకు పిలుపునిచ్చారు. బీజేపీకి గిరిజన సంఘం ఓటు బ్యాంక్ కాదని.. వారు మనదేశానికి గర్వకారణమని ప్రధాని పేర్కొన్నారు. కాగా.. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ మధ్యప్రదేశ్ పర్యటనకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా గిరిజన వర్గాలకు ఆరు లోక్‌సభ స్థానాలు రిజర్వ్ చేయబడిన ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేలా మోడీ ప్రసంగించారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో ఆధార్ అనుదాన్ యోజన కింద దాదాపు 2 లక్షల మంది మహిళా లబ్ధిదారులకు నెలవారీ వాయిదాల పంపిణీ కూడా వుంది. మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో నీటి సదుపాయం , మౌలిక వసతులను పెంపొందించే లక్ష్యంతో వివిధ నీటి సరఫరా ప్రాజెక్ట్‌లు , పట్టణ పరివర్తన పథకాలకు మోడీ శంకుస్థాపన చేశారు. అదనంగా పీఎం మోడీ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను , విద్యాసంస్థలను సైతం ప్రధాని ప్రారంభించారు. ఇందులో తాంత్యా మామా భిల్ యూనివర్సిటీ, సీఎం రైజ్ స్కూల్ వంటివి వున్నాయి. అట్టడుగు వర్గాల సాధికారత, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వ నిబద్ధతను బలోపేతం చేస్తూ ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ్ యోజన కింద గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ప్రధానమంత్రి నిధులు కేటాయించారు.




ఎమ్మెల్యేలు జిఎంఆర్,యెన్నం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం

### ఎమ్మెల్యేలు జిఎంఆర్, యెన్నం

మహబూబ్ నగర్, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని మహబూబ్ నగర్ ,దేవరకద్ర నియోజకవర్గాల శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి మధుసూదన్ రెడ్డిలు అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ కౌన్సిలర్లు, పలువురు పట్టణ ప్రముఖులు, బీజేపీ, టీడీపీ, ఎంఐఎం పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జి. మధుసూదన్ రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే యెన్నం. శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్, బిజెపి, టిడిపి, ఎంఐఎం ల కు చెందిన నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగడంతో పాటు పేద ప్రజల సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా పనిచేస్తుందన్నారు. గత పది ఏళ్లలో రాష్ట్ర ప్రజలు నిరంకుశ పాలనకు గురై వెనకబాటు తరానికి గురయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల ముందుకు వెళ్లి సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేలా పనిచేస్తూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



# వాహనదారులకు గుడ్ న్యూస్

మొదటి పేజీ తరువాయి...

సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ఇది ఫాస్టాగ్స్‌ను రీఛార్జ్ చేయడం లేదా తగినంత బ్యాలెన్స్ గురించి ఆందోళన చెందడం వంటి ఇబ్బందులను తొలగిస్తుంది. దీనివల్ల యూజర్ ఎక్స్‌పీరియన్స్ మెరుగుపడుతుంది. ఎలాంటి అంతరాయం లేకుండా వాహనాలు కంటిన్యూగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోవచ్చు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురుకావు.

**ఫాస్టాగ్స్ ఉంటాయా?**

జిపిఎస్ ఆధారిత టోల్ సిస్టమ్ ఫాస్టాగ్స్‌ను పూర్తిగా భర్తీ చేసే అవకాశం లేదు. ప్రధాన రహదారులతో ప్రారంభించి క్రమంగా అన్ని చోట్లా దీనిని అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే ఇది వచ్చినంత మాత్రాన ఫాస్టాగ్‌లు నిరుపయోగంగా మారవు. వీటిని చిన్న రహదారులపై లేదా బ్యాకప్ ఆప్షన్‌గా భవిష్యత్తులో కూడా ఉపయోగించవచ్చు.

**త్వరలో ప్రారంభం**

2024, ఏప్రిల్ ప్రారంభంలో GPS ఆధారిత టోల్ సిస్టమ్‌ను దేశవ్యాప్తంగా ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. పైలట్ ప్రాజెక్ట్‌ల విజయం, డేటా ప్రైవసీ వంటి ఏవైనా సమస్యలను పరిష్కరించాక ఈ సిస్టమ్‌ను వెంటనే అమల్లోకి తీసుకురావచ్చు. మొత్తం మీద GPS ఆధారిత టోల్ సిస్టమ్ భారతదేశంలో హైవే ప్రయాణ అనుభవాన్ని పూర్తిగా మార్చగలదు. టోల్ బూత్‌లను తొలగించడం, మరింత సమర్థవంతమైన వ్యవస్థను అందిస్తూ, ఇది దేశవ్యాప్తంగా కోట్ల మంది ప్రయాణికులు, సరకు రవాణాదారులకు ప్రయాణ సమయాన్ని, సౌకర్యాన్ని మెరుగుపరుస్తుంది.

# నేడు బీహార్ అసెంబ్లీలో నితీశ్ సర్కారుకు బలపరీక్ష

మొదటి పేజీ తరువాయి...

బీజేపీ ఎమ్మెల్యేలు బయటికి వచ్చారు. ప్రత్యేక బస్సులో పట్నాకు బయలుదేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేసిన జేడీయూ కేవలం 43 స్థానాలనే గెలుచుకుంది. బీజేపీ దాని ఇతర మిత్రపక్షాలు 82 స్థానాల్లో విజయం సాధించాయి. మ్యాజిక్ ఫిగర్ దాటడంతో నితీశ్‌కుమార్ సీఎంగా ఎన్డీఏ సర్కారును ఏర్పాటు చేసింది. అయితే ఆ తర్వాత నితీశ్ బీజేపీతో విభేదించి ఆర్జేడీతో కలిసి మరోసారి సీఎంగా మహాకూటమి సర్కారును ఏర్పాటు చేశారు. తాజాగా ఆర్జేడీతో తెగదెంపులు చేసుకుని మళ్లీ బీజేపీ పంచన చేరారు. మళ్లీ ఎన్డీఏ కూటమి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ సోమవారం బలపరీక్ష ఎదుర్కోబోతున్నారు. మొత్తం 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీలో ప్రస్తుతం ఆర్జేడీ 75, కాంగ్రెస్ 19, సీపీఐ (ఎంఎల్) 12 తో కలిపి మహాకూటమి బలం 110గా ఉన్నది. ప్రభుత్వ ఏర్పాటుకు 122 మంది సభ్యుల బలం అవసరం. ఎన్డీఏ కూటమికి బీజేపీ 74, జేడీయూ 43తో కలిపి 125 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. కాబట్టి ఏదైనా తేడా జరిగితే తప్ప నితీశ్ సర్కారు బలపరీక్ష నెగ్గినట్టే.

# 20 నుండి బీజేపీ విజయ సంకల్ప యాత్రలు

మొదటి పేజీ తరువాయి...

5 విజయ సంకల్ప యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రలకు క్లస్టర్ వారీగా పేర్లు పెట్టినట్లు, భువనగిరి, మల్కాజ్ గిరి, సికింద్రాబాద్ , హైదారాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్ర కి భాగ్యనగరం అని పేరును ఖరారు చేసినట్లు తెలిపారు. కరీంనగర్ , మెదక్ , జహీరాబాద్, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్రకు శాతవాహన అని, అదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్రకు కొమురం భీమ్ అని పేరును నిర్ణయించినట్లు వెల్లడించారు. వీటితో పాటు మహబూబ్ నగర్, నాగర కర్నూల్, నల్గొండ పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్రకు కృష్ణమ్మ అని, ఖమ్మం, వరంగల్, మహబూబ్ బాద్ పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్ర కాకతీయ అని పేర్లను పెట్టారు. ప్రతి రోజు 2, 3 అసెంబ్లీ లని ఒక్కో యాత్ర కవర్ చేస్తుందని, ముఖ్య నేతలు అందరూ అన్ని యాత్రల్లో పాల్గొంటారన్నారు. ఈ యాత్రల సందర్భంగా ఎక్కువ రోడ్ షో లు ఉంటాయన్నారు కిషన్ రెడ్డి. అన్ని యాత్రలు హైదరాబాద్ లో ముగిసే విధంగా ప్లాన్ చేస్తున్నామని, హైదరాబాద్ పార్లమెంట్ లో గెలిచేందుకు పోటీ చేస్తాం%ా% ఎంఐఎంను మట్టి కరిపిస్తామన్నారు. చాలా రాష్ట్రాల్లో బీజేపీ కి కాంగ్రెస్ పోటీ కాదని, తెలంగాణ లో బిజెపికి పోటీ కాంగ్రెస్ అని భావిస్తున్నామన్నారు. ఖమ్మం, నల్గొండ లలో కూడా బీజేపీ కి సానుకూల వాతావరణం ఉందని, కుటుంబ, అవినీతి పార్టీలకి నీతి కోసం ధర్మం కోసం పని చేస్తున్న బీజేపీ కి మధ్య పోటీ అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. 'ఈ ఎన్నికలు దేశం కోసం, దేశ అభివృద్ధి కోసం. సుస్థిరతకు అస్థిరత కు మధ్య జరుగుతున్న ఎన్నికలు.. రేపు బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ, రాష్ట్ర ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ మీటింగ్ లు ఉన్నాయి. మేడిగడ్డ కు మేము ఇంతకు ముందే వెళ్లి వచ్చాము. వాళ్లతో వెళ్లాల్సిన అవసరం లేదు. తెలంగాణ కూర్చొని మాట్లాడుకోవాలి. మా స్టాండ్ ఏందో అసెంబ్లీ లో, అసెంబ్లీ బయట చెబుతాం.' అని కిషన్ రెడ్డి అన్నారు.




# బాలకృష్ణ ఆస్తుల కేసులో ఏసీబీ దూకుడు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం): శివబాలకృష్ణ అక్రమాస్తుల వ్యవహారంపై ఏసీబీ దూకుడుగా వ్యవహరిస్తోంది. కస్టడీ విచారణ సమయంలో ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి పేరును శివబాలకృష్ణ చెప్పడంతో.. ఆయనను విచారించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. న్యాయ సలహాతో నోటీసులు జారీ చేసి విచారించడానికి సిద్ధమవుతోంది ఏసీబీ. 161 కింద నోటీసులు ఇచ్చి వివరాలు సేకరించేందుకు ప్లాన్ చేస్తున్నారు ఏసీబీ అధికారులు. బాలకృష్ణ దగ్గర దొరికిన ల్యాబ్‌టాప్, సెల్‌ఫోన్లు అనాలసిస్ చేస్తున్న ఏసీబీ.. శివ బాలకృష్ణ, ఐఏఎస్ అరవింద్‌ల మధ్య జరిగిన వాట్సాప్ చాట్‌ను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే వారి మధ్య వాట్సప్ సంభాషణలు జరిగాయని, అక్రమార్జనను ఆస్తులుగా మార్చుకునేందుకు బినామీలతోనూ సంభాషించినట్లు చెబుతున్నారు. భూములు కొని రిజిస్ట్రేషన్ చేసిన సమయంలో బినామీలు అక్కడే ఉన్నట్లు నిరూపించాల్సిన అవసరం ఏసీబీ ముందుంది. అలాగే ఐఏఎస్ అధికారికి వాటాల సొమ్మును శివబాలకృష్ణ స్వయంగా ముట్టజెప్పిన సమయంలోనూ ఇద్దరూ ఒకే చోట ఉన్నట్లు తేల్చాల్సి ఉంది. సెల్‌ఫోన్ల డేటాను వడపోసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఐఏఎస్ అరవింద్‌ను విచారించేందుకు ప్రభుత్వం అనుమతి కోరింది ఏసీబీ. ఐఏఎస్ అధికారి అదేశాల మేరకు అనుమతులు జారీ చేసి కోట్ల రూపాయలు గడించినట్లు.. ఇదే విషయాన్ని కస్టడీ సమయంలో ఏసీబీకి శివ బాలకృష్ణ వెల్లడించినట్లు సమాచారం.

# మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలపై రేవంత్ సర్కారు దృష్టి

మొదటి పేజీ తరువాయి...

చేతుల్లోకి వెళ్లింది. నిజాం దక్కన్ షుగర్స్‌గా మారిన తర్వాత 13 ఏళ్లు నిర్వహణ సమస్యలు ఎదుర్కొంది. క్రమంగా ఉత్పాదన తగ్గిపోవడంతో 2015లో మూతపడింది. అప్పటి నుంచి నిజాం షుగర్స్ తెరిపించాలని చాలా ఉద్యమాలు నడిచాయి. ఎన్నో పార్టీలు హామీలిచ్చినా.. కార్యరూపం మాత్రం దాల్చలేదు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డి నిజాం షుగర్ ఫ్యాక్టరీపై వేసిన కమిటీతో సమావేశమయ్యారు. బోధన్, ముత్యంపేటలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీల పెండింగ్ బకాయిలు, ఆర్థిక ఇబ్బందులపై కమిటీ చర్చించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇందులో భాగంగానే సిఫార్సుల కమిటీని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. అయితే.. మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపించే క్రమంలో 51 శాతంగా ఉన్న భాగస్వామి ఒప్పుకుంటే సంయుక్తంగా నిర్వహించాలని.. లేకుంటే ప్రభుత్వమే పూర్తిగా నిర్వహణ బాధ్యతలు చేపట్టాలన్న ఆలోచనలో ఉంది.

# రాష్ట్రంలో భారీగా ఎంపీడీఓల బదిలీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో భారీగా ఎంపీడీఓల బదిలీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అయితే.. డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఎంపీడీఓలను బదిలీ చేసింది. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సేవలందిస్తున్న 395 మంది ఎంపీడీవోలను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సొంత జిల్లాల్లో పని చేస్తున్న వారితో పాటు మూడేళ్లకుపైగా ఒకేచోట పని చేస్తున్న ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని గతేడాది డిసెంబర్‌లో ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈసీ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వం 395 మంది మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారులను బదిలీ చేసింది తెలంగాణ సర్కార్. అయితే.. ఇదిలా ఉండగా.. శనివారం ప్రభుత్వం 32 మంది డిప్యూటీ కలెక్టర్లతో పాటు 132 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీజోన్-1లో 84 మంది తహసీల్దార్లు, మల్టీజోన్-2లో 48 మంది తహసీల్దార్లను బదిలీ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, రాబోయే రోజుల్లో మరికొన్ని శాఖల్లోనూ అధికారుల బదిలీలు చేపట్టనున్నట్లు తెలుస్తున్నది.

# ఢిల్లీకి దారి బంద్!

## డిమాండ్ల సాధన కోసం రేపు రైతన్నల 'ఢిల్లీ చలో' మార్చ్

న్యూఢిల్లీ/చండీగఢ్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం): అన్నదాతలు మరోసారి పోరుబాట పట్టారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతోపాటు తమ ఇతర డిమాండ్లు పరిష్కరించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు దాదాపు 200కు పైగా రైతు సంఘాలు ఈ నెల 13న(మంగళవారం) 'ఢిల్లీ చలో' మార్చ్ నిర్వహించతలపెట్టాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోకి రైతులు ప్రవేశించకుండా అధికారులు సరిహద్దుల్లో అధిక బలగాలను మోహరించారు. సింఘూ, ఘాజీపూర్, టిక్రి సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. రైతులతో కూడిన వాహనాలు ఢిల్లీలోకి ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. రైతుల వాహనాలు పంక్చర్ అయ్యేలా పలు చోట్ల ఇనుప మేకులు కూడా ఏర్పాటు చేశారు. హర్యానా-ఢిల్లీ, యూపీ-ఢిల్లీ సరిహద్దుల్లో భద్రతా ఏర్పాట్లను ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా ఆదివారం పరిశీలించారు. రాజధానిలోకి ప్రవేశించే రోడ్లను బ్లాక్ చేసేందుకు పెద్ద కంటెయినర్లను తరలిస్తున్నారు. బస్సు, రైలు లేదా ఏ ఇతర మార్గంలోనూ రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా చూసేలా పలు బృందాలతో నిఘా పెట్టారు. ఈశాన్య ఢిల్లీలో 144 సెక్షన్ కూడా విధించి నిషేధ్నాలు అమలు చేస్తున్నారు. 'ఢిల్లీ చలో' ఆందోళనకు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ నుంచి పెద్దయెత్తున రైతులు వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు హర్యానాలోని ఖట్టర్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రైతులను నిలువరించేందుకు పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించింది. పంజాబ్ నుంచి రాష్ట్రంలోకి రైతులు ప్రవేశించకుండా సరిహద్దుల్లో సిమెంట్ బారికేడ్లు, ఇనుప కంచెలను సిద్ధం చేసింది. కొన్ని చోట్ల రోడ్లపై కొంత మంది ఇనుప మేకులను డ్రిల్లింగ్ చేస్తుండటం కనిపించిందని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. వాహనాలను అంబాలా నుంచి ఢిల్లీ వైపు వెళ్లనీయకుండా శంభు వద్ద హర్యానా-పంజాబ్ సరిహద్దును మూసివేశారు. ఆదివారం నుంచి మంగళవారం రాత్రి వరకు అంబాలా, కురుక్షేత్ర సహా ఏడు జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్, బల్క్ ఎస్ఎంఎస్ సేవలపై ఆంక్షలు విధించారు. చాలా జిల్లాల్లో 144 సెక్షన్ విధించింది. ఢిల్లీకి సమీపంగా ఉండే సరిహద్దు సోనిపట్‌లో సీసాలు, ఇతర డబ్బాల్లో ఇంధనం నింపవద్దని ఆయిల్ బంకుల యాజమానులకు జిల్లా యంత్రాంగం సూచించింది. ట్రాకర్లకు ఇంధన ఫిల్లింగ్‌ను 10 లీటర్ల వరకే పరిమితం చేసింది.



స్థానిక నాయకులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర రెడ్డి

## ఛలో నల్లగొండ సభను విజయవంతం చేయండి

### దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఏవిఆర్

కొత్తకోట, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం) కృష్ణా నదిపై తెలంగాణ ప్రాజెక్టులు, నీటి హక్కులను హరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సంస్థ కేఆర్ఎంబికి అధికారాలు అప్పగించడం ద్వారా జరగబోయే దుష్పరిణామాలను ఖండిస్తూ తెలంగాణ సమాజానికి వివరించేందుకు నల్లగొండ పట్టణంలో ఈనెల 13న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని దేవరకద్ర నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు . ఆదివారం వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మదనాపురం మండలం దుప్పల్లి గ్రామంలో బిఆర్ఎస్ కార్యకర్తలతో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ నేత ,మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు పదేళ్లు పాలన సాగిస్తే కాంగ్రెస్ అసత్య ఆరోపణలు చేసి అలివి కాని వాగ్దానాలను ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చి విస్మరించడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కృష్ణా జలాలపై ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పికొట్టేందుకు మాజీ సీఎం కేసీఆర్ నల్గొండలో తలపెట్టిన సభను విజయవంతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త తరలిరావాలన్నారు.



వడ్డేమాన్ గ్రామంలో పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా రోడ్లను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

### ఎమ్మెల్యే జిఎంఆర్

**పరిసరాల పరిశుభ్రత ప్రజల బాధ్యత**

దేవరకద్ర, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం) పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని అందుకోసం ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాల శుభ్రత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు గవినోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని చిన్న చింతకుంట మండలం పెద్ద వడ్డేమాన్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పారిశుధ్య వారోత్సవాలలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రజా ప్రతినిధులు, నాయకులు, పారిశుధ్య కార్మికుల తో కలిసి చీపురు తో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీయంఆర్ పారిశుధ్య కార్మికులతో కలిసి మొక్కలకు నీరు పోసి, అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... పారిశుధ్య వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని, పారిశుద్ధ పనులు నిరంతరం జరగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఆదివారం కావడంతో నుమాయిష్‌లో జన సందోహం





నుమాయిష్‌లో సందర్శకులు

### మూడు రోజులలో ముగియనున్న నుమాయిష్

### తక్కువ ధరలకే డ్రెస్ లు, చెప్పులు, బెడ్ షీట్ లు, ఇతర వస్తువులు

### నుమాయిష్‌లో పిస్తా హౌస్ హాలీమ్‌కు బలే గిరాకీ

బుద్వేల్, ఫిబ్రవరి11(ప్రభాత ఉదయం): నాంపల్లి నుమాయిష్ లో ఆదివారం జన సందోహం కనిపించింది. మరో మూడు రోజుల్లో నుమాయిష్ ముగియ నుండడంతో జనం తండోపతండాలుగా వస్తున్నారు. నుమాయిష్ ను తిలకించడానికి , వివిధ వస్తువులను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. నుమాయిష్ లో మహిళలకు డ్రెస్సులు, చెప్పులు తక్కువ ధరకు లభిస్తున్నాయి. బెడ్ షీట్లు, బ్యాగులు తదితర వస్తువులు కూడా తక్కువ ధరకు లభిస్తుండడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో నుమాయిష్ లో కొనుగోలు చేస్తున్నారు.

**సందర్శకులను ఆహ్లాదపరచడానికి మ్యూజికల్ నైట్ ప్రోగ్రాం :**
నుమాయిష్ కు వచ్చే సందర్శకులను ఆహ్లాదపరచడానికి మ్యూజికల్ నైట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ప్రముఖ గాయకుల చేత పాటలు పాడిస్తూ నుమాయిష్ కు వచ్చే సందర్శకులను మంత్ర ముగ్దులను చేస్తున్నారు.

**పిస్తా హౌస్ హాలీమ్‌కు భలే గిరాకీ :**
నుమాయిష్‌లో పిస్తా హౌస్ హాలీమ్‌కు భలే గిరాకీ లభిస్తుంది. ప్రజలు పెద్ద ఎత్తున పిస్తాహౌస్‌లో హాలీమ్ తినడానికి ఇష్టపడుతున్నారు. పిస్తాహౌస్ తో పాటు మస్కతి డైరీ రకరకాల ఐస్‌క్రీమ్‌లను అందుబాటులో ఉంచారు.

**నుమాయిష్ చుట్టురా కలియ తిరుగుతున్న ట్రైయిన్ :**
నుమాయిష్ ను తిలకించడానికి వచ్చిన సందర్శకులను ట్రైయిన్ లో ఎక్కించుకొని చుట్టూరా కలియ తిరుగుతున్నారు . చిన్నారులు, పెద్దలు, సంతోషంగా ట్రైయిన్ లో కలియ తిరుగుతూ నుమాయిష్ ను తిలకిస్తున్నారు.





నుమాయిష్‌లో జన సందోహం



బిజెపి నేత, చేవెళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్గూడ లో ఆదివారం జరిగిన సంతలో జూటు బ్యాగులను పంపిణీ చేయడానికి వచ్చిన సందర్భంగా బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం వనితారెడ్డి, నాయకురాలు నాగమణి లు కలిశారు.

## కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య

బుద్వేల్, ఫిబ్రవరి11(ప్రభాత ఉదయం) : కుటుంబ కలహాల కారణంగా నరసింహ చారి( 60) అనే వ్యక్తి శనివారం ఇంట్లో చున్నీతో పైకప్పు రాడ్ కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు . భార్యతో గొడవపడిన నరసింహ చారి ఇంట్లో ఎవరు లేనప్పుడు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై రమేష్ నరసింహ చారి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అయోధ్యకు బయలుదేరిన రామభక్తుల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి

## ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో రామరాజ్యం

### మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కే నరేందర్ రెడ్డి

**అయోధ్య రామ భక్తుల బస్సుకు జెండా ఊపి ప్రారంభించిన నరేందర్ రెడ్డి**

గండిపేట, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం) కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రభుత్వం రామరాజ్యంగా కొనసాగుతుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండకల్ల నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం అయోధ్యకు బయలుదేరిన రామభక్తుల బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. చేవెళ్ల పార్లమెంట్ బిజెపి ఆధ్వర్యంలో రామ భక్తులూ మణికొండ మున్సిపాలిటీ నుంచి సికింద్రాబాద్ స్టేషన్ నుండి అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాణికొండ మునిసిపాలిటీ వైస్ చైర్మన్ కే నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... నాడు హైందవుల ఆరాధ్య దైవం శ్రీరాముల పాలన కొనసాగినట్లు దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం సుభిక్ష పాలన అందిస్తూ దేశ ప్రగతి, పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సిద్ధప్ప , మణికొండ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు బీరప్ప , జిల్లా కార్యవర్గ సభ్యులు రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

# తన భూమిలో నుండి రోడ్డు నిర్మిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి: లక్ష్మీనారాయణ

శంషాబాద్, ఫిబ్రవరి 11, (ప్రభాత ఉదయం) పెద్ద షాపూర్ రెవిన్యూ పరిధిలోని తన భూమిలో కొంతమంది దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతు లక్ష్మీనారాయణ శంషాబాద్ పోలీసు అధికారులను కోరారు. శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్ రెవిన్యూ గ్రామంలో సర్వే నంబర్ 52 /అ లో తమ పూర్వీకుల నుండి సంక్రమించిన 18 గంటల భూమి ఉన్నదని బొద్దం లక్ష్మీనారాయణ తెలిపారు. అక్కడ వెంచర్ చేసిన కొంతమంది వ్యక్తులు తమ పొలంలో నుండి దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని వెంటనే రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేసి తనకు న్యాయం చేయాలని ఆయన పోలీసులను ఆశ్రయించారు. టిఫన్ సర్వే చేస్తే ఎవరి పొలం ఎక్కడ ఉందో స్పష్టంగా అర్థమవుతుందని అప్పటివరకు ఎలాంటి నిర్మాణ పనులు కానీ. రోడ్డు నిర్మాణం కాని చేపట్టవద్దని కోరారు. ఎవరైనా తన భూమిని ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

పట్టా పొలంలో బలవంతంగా రహదారి నిర్మిస్తున్న దృశ్యం





బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో పాల్గొన్న బుక్క వేణుగోపాల్

## బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో పాల్గొన్న బుక్క వేణుగోపాల్

శంషాబాద్, ఫిబ్రవరి 11, (ప్రభాత ఉదయం) భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ చేపట్టిన ప్రజాహిత యాత్ర కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ పాల్గొన్నారు. యాత్ర రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న ఆయన కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా అవతరించబోతున్నదని అన్నారు. తన రాజకీయ చాణిక్య నీతితో శత్రుదేశాలకు కంటిమీద కునుక్కు లేకుండా చేస్తూ దేశానికి పటిష్టమైన భద్రతను కల్పిస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వంలో మరోసారి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు కాబోతున్నదని జోష్యం చెప్పారు. ఈసారి బిజెపి కూటమికి 400 పైన సీట్లు సాధించే విధంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందని బుక్క వేణుగోపాల్ తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గం లో వివిధ గ్రామాలను సందర్శించి ప్రభుత్వ విధానాలను వారికి తెలియజేయడం జరుగుతుందని అన్నారు.

## ప్లాస్టిక్ నివారించండి... పర్యావరణాన్ని కాపాడండి

**బిజెపి నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



హైదర్‌గూడలో జరిగిన సంతలో ప్రజలకు జూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న బిజెపి నేత కొండా విశ్వేశ్వర్ రెడ్డి



రాజేంద్రనగర్, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం) ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని దీంతో మానవుని శరీరం అనారోగ్యానికి గురవుతుందని అందుకోసం ప్రజలు ప్లాస్టిక్ రహిత వస్తువులను వాడాలని భారతీయ జనతా పార్టీ నేత, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం తాను సొంతంగా తయారు చేయించిన జూటు బ్యాగులను స్థానిక బిజెపి నాయకులు ఎన్ మల్లారెడ్డి, డి సత్యనారాయణ, షాబాద విజయకుమార్, కాకులారం కృష్ణ లతో కలిసి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్గూడ లో జరిగిన సంత లో ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యావరణ పరిరక్షణ కోసం ఎంతో కృషి చేస్తున్నారని ప్రజలు బాధ్యతాయుతంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడడం పాటు అనేక రుగ్మతలకు దారితీస్తున్న అన్నారు.

## అయోధ్యకు బయలుదేరిన రామ భక్తులు



రాజేంద్రనగర్ నుంచి అయోధ్య బయలు దేరిన ప్రజలు, బీజేపీ నాయకులు



బుద్వేల్, ఫిబ్రవరి11(ప్రభాత ఉదయం): శ్రీ రామ జన్మ భూమి దర్శన్ అభియాన్ లో బాగంగా ఆదివారం అయోధ్య కు ఆస్త యాత్ర స్పెషల్ రైలు లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుండి రెండు వందల మంది రామ భక్తులు బయలుదేరి వెళ్లారు. డైరీ ఫార్మ్ సర్కిల్ లో జిల్లా బీజేపీ అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ , జిల్లా కార్యదర్శి ఎం.కొమరయ్య, కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీశంకర్ , అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేష్ యాదవ్ , డివిజన్ అధ్యక్షులు జి.బాబు రావు లు శ్రీ రామ చిత్ర పటానికి పూలమాలలు వేసి బ్రాహ్మణుల చే పూజలు చేయించి భక్తులను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు సాగణంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, బండారి బాలకృష్ణ, ఈ.వేణుగోపాల్, వై. గోపాల్, మల్లేష్ చారి , వై.అభినవ్, వై.సాత్విక్ , కిరణ్ , పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## అదృశ్యం అయిన చిన్నారుల ఆచూకీ లభ్యం



తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పజెప్పిన పోలీసులు

శంషాబాద్, ఫిబ్రవరి 11, (ప్రభాత ఉదయం) శనివారం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లిలో అదృశ్యమైన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ పోలీసులు కనుగొన్నారు. పురపాలక సంఘం పరిధిలోని తొండుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన సుమన్ దేవి రాకేష్ శర్మల కుమారులు కవల పిల్లలైన అనురాగ్ మనీష్ కుమార్ లను పాఠశాల ఉపాధ్యాయులు మందలించడంతో అటు ఇంట్లోనూ ఇటు పాఠశాలలను చెప్పకుండా అదృశ్యమైన సంఘటన కలకలం రేపింది. ఈ విషయమై తల్లిదండ్రులు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ ఇద్దరు చిన్నారుల ఆచూకీ కనుగొన్నారు. విద్యార్థులు ఇద్దరు శంషాబాద్ ( ఉందా నగర్) రైల్వే స్టేషన్ సమీపంలో ఉండగా పోలీసులు వారిని కనుగొన్నారు. తల్లి దండ్రులకు అప్పగించారు.

## బీజేపీ నాయకుడు శ్రీధర్ అతని సోదరుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

శంషాబాద్, ఫిబ్రవరి 11, (ప్రభాత ఉదయం) దళిత యువతి ప్లాట్ ను కబ్జా చేయడంతోపాటు ఆమెపై చేయి చేసుకున్న కేసులో ఇద్దరు వ్యక్తులపై శంషాబాద్ పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తొండుపల్లి గ్రామానికి చెందిన రాచమల్ల సౌజన్య కు తొండుపల్లిలో ప్లాట్ ఉన్నది. దాని పక్కనే వ్యవసాయ పొలం ఉన్న బైతి కృష్ణ పథకం ప్రకారం ఆ ప్లాట్ ను కబ్జా చేశాడు. ఈ విషయమై సౌజన్య ఆమె భర్త రాజ్ కుమార్ కృష్ణను ప్రశ్నించగా అతని సోదరుడు శ్రీధర్ జోక్యం చేసుకున్నాడు. వారి మధ్య మాట మాట పెరగడంతో సౌజన్య పై చేయి చేసుకున్నారు. దీనిపై వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తమ భూమి పత్రాలు చూపిస్తున్న సౌజన్య

# అండర్-19 చాంపియన్ ఆస్ట్రేలియా




### ప్రపంచకప్ ఫైనల్‌లో టైటిల్ ఎగరేసుకుపోయిన ఆస్ట్రేలియా

### 79 పరుగులతో ఓటమి

### యువభారత జట్టుకు పరాభవం తప్పలేదు

### అద్వితీయ ప్రదర్శనతో అజేయంగా ఫైనల్‌కు చేరిన యంగ్‌ఇండియా..

### తుదిపోరులో కంగారూల అడ్డంకిని అధిగమించలేకపోయింది



బెనోనీ (దక్షిణాఫ్రికా): అండర్-19 ప్రపంచకప్‌లో అపజయం ఎరగకుండా.. ఫైనల్ చేరిన యువభారత జట్టుకు చివర్లో చుక్కెదురైంది. ఆదివారం జరిగిన తుదిపోరులో యంగ్‌ఇండియా 79 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. డిఫెండింగ్ చాంపియన్‌గా ఈ టోర్నీలో అడుగుపెట్టి వరుస విజయాలతో ఫైనల్‌కు దూసుకొచ్చిన యంగ్‌ఇండియా.. అదే జోరు కొనసాగించడంలో విఫలమైంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. హర్జాస్ సింగ్ (55బీ 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకం సాధించగా.. కెప్టెన్ వైబ్‌గెన్ (48), హ్యారీ డిక్సన్ (42), ఒలీవర్ (46లి) రాణించారు. భారత బౌలర్లలో రాజ్ లింబాని 3, నమన్ తివారి రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం అండర్ ప్రపంచకప్ ఫైనల్స్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన యంగ్‌ఇండియా 43.5 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. ఆదర్శ్ (47), మురుగన్ అభిషేక్ (42) కాస్త పోరాడగా.. కెప్టెన్ ఉదయ్ సహరాన్ (8), సచిన్ దాస్ (9), అర్షిన్ (3), ప్రియాన్షు (9), అవవెల్లి అవనీశ్ రావు (0) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో మహ్లీ బ్రాడ్‌మన్, మెక్‌మిలన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. మహ్లీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', ఆసీస్ పేసర్ క్వెన ఎంపెకాకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి. నిరుడు సొంతగడ్డపై జరిగిన సీనియర్ వన్డే ప్రపంచకప్‌లో రోహిత్‌శర్మ సారథ్యంలోని భారత జట్టు భారీ ఆశలతో అడుగుపెట్టి.. అందుకు తగ్గట్లే పరాజయం ఎరగకుండా ఫైనల్ చేరింది. ఇప్పుడు అచ్చం అదే రీతిలో యువ భారత జట్టు ఒక్క ఓటమి లేకుండానే అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. లీగ్‌దశలో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ రోహిత్‌సేన విజృంభిస్తే.. తాజాగా యంగ్‌ఇండియా కూడా గ్రూప్ దశ, సూపర్ సిక్స్‌లో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా విజృంభించింది. సీనియర్ ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ సెంచరీల మోత మోగిస్తే.. తాజా టోర్నీలో ముషీర్ ఖాన్, సచిన్ దాస్, ఉదయ్, అర్షిన్ శతకాలు నమోదు చేసుకున్నారు. నవంబర్ 19న దాదాపు లక్ష మందికి పైగా అభిమానుల సమక్షంలో అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా టాస్ గెలువగా.. తాజా పోరులోనూ అదే సీన్ రిపీట్ అయింది. అప్పుడు టీమ్‌ఇండియా మొదట బ్యాటింగ్ చేసి 240 పరుగులకు పరిమితమైతే.. ఇప్పుడు 254 పరుగుల లక్ష్యఛేదనలో యంగ్‌ఇండియా తడబడింది. టోర్నీ ఆసాంతం పరుగుల వరద పారించిన కోహ్లీ, రాహుల్, రోహిత్ తుదిపోరులో ఓ మోస్తరుగా ఆడగా.. తాజా మ్యాచ్‌లో టాపార్డర్ వైఫల్యమే దెబ్బకొట్టింది. దీంతో ఆస్ట్రేలియా ఇటీవలి కాలంలో వరుసగా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్, వన్డే ప్రపంచకప్, అండర్-19 ప్రపంచకప్ ఫైనల్స్‌లో భారత్‌పై విజయాలు సాధించింది. 4 అండర్-19 ప్రపంచకప్‌లో యువభారత జట్టు రన్నరప్‌గా నిలువడం ఇది నాలుగోసారి. ఇప్పటి వరకు తొమ్మిదిసార్లు ఫైనల్ చేరిన యంగ్‌ఇండియా 5 సార్లు ట్రోఫీ చేజిక్కించుకుంది.

#### సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 253/7 (హర్జాస్ సింగ్ 55, వైబ్‌గెన్ 48బీ రాజ్ లింబాని 3/38, నమన్ 2/63),

భారత్: 43.5 ఓవర్లలో 174 ఆలౌట్ (ఆదర్శ్ 47, అభిషేక్ 42బీ మహ్లీ 3/15, మెక్‌మిలన్ 3/43).





## వాలీబాల్‌కు గ్రామాల్లో ఫుల్ క్రేజ్

### విజయ్ దేవరకొండ

తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలకితీసి వారిని ప్రోత్రహించేందుకు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ ఓ వేదికగా నిలుస్తుందని ప్రముఖ చలనచిత్ర నటుడు, హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు సహ యజమాని విజయ్ దేవరకొండ అన్నాడు. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు నూతన జెర్సీని యజమాని అబిషేక్ రెడ్డితో కలిసి విజయ్ అవిష్కరించాడు. ఈ సందర్భంగా రంగారెడ్డి, నెల్లూరు జిల్లాల మధ్య నిర్వహించిన ఒపెన్ మ్యాచ్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. తనకు వాలీబాల్ అంటే చిన్నతనం నుంచి చాల ఇష్టమని, అనంతపురం పుట్టపర్తిలో చదువుకునే రోజుల్లో అక్కడి గ్రామీణులతో కలిసి వాలీబాల్ అడేవాడినని అన్నాడు. గ్రామీణ ప్రాంతాల్లో వాలీబాల్‌కు మంచి గుర్తింపు ఉందని.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ సహాయపడుతుందని అన్నారు.




### వరుసగా రెండోసారి

## టైటిల్ గెలిచిన సన్ రైజర్స్

సౌతాఫ్రికాలో జరిగిన ఎస్ఏ టీ20 లీగ్ లో సన్ రైజర్స్ ఈస్టర్న్ కేప్ వరుసగా రెండోసారి టైటిల్ గెలుచుకుంది. నిన్న కేప్ టౌన్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సన్ రైజర్స్ ఈస్టర్న్ కేప్ 89 పరుగుల భారీ తేడాతో డర్బన్ సూపర్ జెయింట్స్ పై గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 204 పరుగులు చేసింది. సన్ రైజర్స్ బ్యాటింగ్‌లో జోర్డాన్ హెర్మన్ 42, అబెల్ 55, కెప్టెన్ మార్ క్రమ్ 42 నాటౌట్, ట్రిస్టాన్ స్టబ్స్ 56 నాటౌట్ పరుగులతో భారీ స్కోరును నమోదు చేశారు. అనంతరం 205 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన డర్బన్ సూపర్ జెయింట్స్ 115 పరుగులకే ఆలౌటైంది. సన్ రైజర్స్ బౌలర్లు 17 ఓవర్లలోనే ఆటను ముగించారు. యువ ఆల్ రౌండర్ మార్కో యన్సెన్ అద్భుత బౌలింగ్ తో 5 వికెట్లు పడగొట్టాడు. కాగా.. సన్ రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టుకు ఫ్రాంచైజీ ఎవరంటే కావ్య మారన్. ఐపీఎల్‌లో అంతగా అలరించకపోయిన సన్ రైజర్స్ జట్టు.. సౌతాఫ్రికాలో మాత్రం రెండోసారి టైటిల్ గెలుచుకుంది. దీంతో సన్ రైజర్స్ ఫ్రాంచైజీ యజమాని కావ్యా మారన్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఫైనల్ మ్యాచ్ ను తిలకించిన కావ్యా మారన్.. డర్బన్ జట్టు చివరి వికెట్ కోల్పోగానే ఎగిరి గంతులేసింది. ఆ తర్వాత.. సన్ రైజర్స్ ఆటగాళ్లతో తన ఆనందాన్ని పంచుకున్నారు. అంతేకాకుండా.. ట్రోఫీని సన్ రైజర్స్ కెప్టెన్ మార్‌క్రమ్ కావ్య మారన్ చేతికి అందించారు. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కెర్లు కొడుతున్నాయి. కాగా.. సన్ రైజర్స్ ఫ్రాంఛైజీ ఐపీఎల్ లో రెండు టైటిల్స్ గెలుచుకుంటే.. సౌతాఫ్రికా లీగ్‌లో రెండు టైటిల్స్ 2023, 2024 సీజన్‌లలో గెలుపొందింది.

### మహేశ్ సినిమా కోసం

# హాలీవుడ్‌ను దింపుతున్న జక్కన్న









టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న SSMB29 మరొకొద్ది రోజుల్లో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ సినిమా కోసం కఠోరమైన శిక్షణ పొందుతున్నాడు మహేశ్. ఈ చిత్రానికి సంబంధించిన కీలక వివరాలు గోప్యంగా ఉన్నప్పటికీ.. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ నటిని ఎంపిక చేసినట్లు పుకార్లు వస్తున్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన 'క్రిస్ హెమ్స్‌వర్త్' SSMB29 ప్రాజెక్ట్‌లో భాగం కానున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ చిత్రాలలో ఆయన చాలా పాపులర్ యాక్టర్. ప్రపంచంలో అత్యధిక పారితోషికం తీసుకునే నటుల జాబితాలో ఆయన 31వ స్థానంలో ఉన్నారని ఫోర్బ్స్ గతంలో ప్రకటించింది. 2011లో 'థోర్' చిత్రం ద్వారా ఆయనకు భారత్‌లో కూడా విపరీతమైన క్రేజ్ దక్కింది. ఆ తర్వాత ఎవెంజర్స్ ఫ్రాంచైజీస్, ట్రాన్స్‌ఫార్మర్స్ ,ఎక్స్‌ట్రాక్సన్, MIB వంటి చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా మంచి ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకున్నాడు. అలాంటి హీరోను ప్రాజెక్ట్‌లోకి రాజమౌళి తీసుకురానున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో ఎంతవరకు నిజం ఉందో తెలియదు కానీ ఇదే నిజం అయితే మహేశ్ సినిమా హాలీవుడ్‌లో దుమ్మురేపడం ఖాయం అని చెప్పవచ్చు. ఎస్ఎస్ రాజమౌళి అంతర్జాతీయ స్థాయిలో దర్శకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. బాహుబలి ఫ్రాంచైజీతో పాటు వరకు బ్యాక్-టు-బ్యాక్ హిట్లు కొట్టాడు. ఆర్‌ఆర్‌ఆర్ కోసం విదేశీ నటీనటులను ఆయన ఎంచుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మహేశ్‌కు జోడీగా ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్‌ను ఎంపిక చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌ని నిశితంగా పరిశీలిస్తే.. ఇన్‌స్టాగ్రామ్‌లో రాజమౌళిని ఆమె ఫాలో అవుతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఆమె కీలక పాత్ర పోషిస్తుందనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే చెల్సియా ఇన్‌స్టాగ్రామ్‌లో మహేష్ బాబును అనుసరించడం లేదని గమనించాలి.కానీ బాలీవుడ్ హీరోయిన్లు అయిన దిశా పటానీ, దీపికా పదుకొణ్‌లను ఆమె ఫాలో అవుతుంది. రచయిత విజయేంద్ర ప్రసాద్ ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ లాక్ చేయబడిందని ఈ ఏడాదిలో షూటింగ్ ప్రారంభం అవుతుందని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. భారీ బడ్జెట్‌తో యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం మహేశ్ బాబు చాలా కష్టపడ్డాడు. ఈ సినిమా కోసం ఆయన రెమ్యునరేషన్ తీసుకోకుండా ప్రాజెక్ట్‌లో భాగస్వామిగా ఉండబోతున్నారని సమాచారం.



### తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్‌కు రూ. 10 లక్షల విరాళం ప్రకటించిన

# బేబీ నిర్మాత

తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరిగిన విషయం తెల్సిందే. గుడుంబా శంకర్ దర్శకులు వీర శంకర్ నేతృత్వంలోని ప్యానల్.. ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. ఈ ప్యానల్ లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన వీరశంకర్ తో పాటు ఉపాధ్యక్షులుగా సక్సెస్ ఫుల్ యంగ్ డైరెక్టర్స్ సాయి రాజేష్ , వశిష్ట భారీ మెజారిటీతో గెలుపొందారు. బేబి చిత్రంతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న యువ నిర్మాత ఎస్ కేఎన్ ఈ విజయోత్సవ సభలో తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యుల గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం కోసం తనవంతుగా రూ.10 లక్షల రూపాయల భారీ విరాళాన్ని ప్రకటించారు. తన స్నేహితులైన దర్శకులు సాయి రాజేశ్, వశిష్టకు మద్దతుగా ఎస్ కేఎన్ ఈ విరాళాన్ని అందించారు. ముఖ్యంగా తన స్నేహితుడు సాయి రాజేశ్ తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ వాగ్ధానానికి మద్ధతుగా రూ.10 లక్షల రూపాయల విరాళాన్ని ఎస్ కేఎన్ అందించారు. నిర్మాత ఎస్ కేఎన్ ఇచ్చిన విరాళం పట్ల తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నిర్మాత ఎస్ కేఎన్ కు చప్పట్లతో అభినందనలు తెలిపారు. దర్శకుల సంఘానికి ఒక నిర్మాత ఇలా విరాళం ఇవ్వడంపై హర్షం వ్యక్తమవుతోంది.తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో చరిత్ర సృష్టించారు సాయి రాజేశ్. ఉపాధ్యక్ష పదవికి పోటీ పడిన సాయి రాజేశ్ కు 576 ఓట్లు వచ్చాయి. తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ ఇన్నేళ్ల చరిత్రలో ఒక పదవికి పోటీ చేసిన వ్యక్తికి ఇంత భారీగా ఓట్లు రావడం ఇదే తొలిసారి. ఇదొక ఎవర్ గ్రీన్ రికార్డ్ గా నమోదైంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.